క్లుప్తంగా

రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడొచ్చు



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న శిరీష

కొత్తగూడెంరూరల్: రక్తదానం చేసి మరొకరి ప్రాణం కాపాడవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జేవీఎల్ శిరీష అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాలోని వైద్య కళాశాల, జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. మాట్లాడుతూ... రక్తం ఇవ్వటం ద్వారా దాత శరీరంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. విద్యాదానం జీవితాన్ని ఇస్తుందని, రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడినవారు అవుతారన్నారు.

ఘనంగా చేగువేరా జయంతి

పాల్వంచరూరల్: మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో శుక్రవారం విప్లవ వీరుడు చేగువేరా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ... వృత్తిరీత్యా వైద్యుడైన చేగువేరా క్యూబా దేశ విముక్తి కోసం చేసిన పోరాటంలో విజయం సాధించి ప్రపంచంలో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.

రెగ్యులర్ ఏఓను నియమించాలి

జూలూరుపాడు: రెగ్యులర్ ఏఓను నియమించాలని కోరుతూ బీఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏడీఏ డి.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జూలూరుపాడులో కొత్తగూడెం ఏడీఏ రమేష్‌ను బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ... ఇన్‌చార్జ్ ఏఓ స్థానంలో రెగ్యులర్‌ను నియమిస్తే రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగుపై సూచనలు ఇస్తారన్నారు.

అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ డీపీఆర్ఓ లేకపోవడం వల్ల జాప్యం జరిగిందని, పదిరోజుల్లో కొత్త అక్రిడేషన్ కార్డులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూదోట సూరిబాబు, జి.వెంకటేశ్వర్లు, రామిశెట్టి సైదయ్య, ఎం.వెంకటాచారి, ఎన్.సుధాకర్‌రావు, బి.శివనాగిరెడ్డి, కుంజా వెంకటేష్, కె.శ్రీరామ్, ఆకుల శివ, రమేష్ పాల్గొన్నారు.

మెకానిక్‌లకు గుర్తింపు కార్డుల పంపిణీ

పాల్వంచ: స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పాల్వంచ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్‌లకు గుర్తింపు కార్డులను పట్టణ ఎస్ఐ బి.రాము శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ... కస్టమర్లకు నమ్మకమైన సేవలను అందించాలన్నారు. వినియోగదారుల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని, తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, ఎక్కడ ఎలాంటి అనుమానాస్పద, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐని సన్మానించారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపిక

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ప్రకటించే నేషనల్ మీమ్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకానికి టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. హెచ్ఎం మెరుగు శ్రీనివాస్ శుక్రవారం మాట్లాడుతూ.. ఎనిమిదో తరగతి విద్యార్థులు ఎం.తేజశ్వి, ఎస్.మహేందర్, వి.గీతాంజలి, ఎస్.గురుచరణ్‌లు ఎంపిక అయినట్లు తెలిపారు. వీరికి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తయ్యే వరకు ఐదు సంవత్సరాల పాటు నెలకు రూ.1000 చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందని చెప్పారు.

పాల్వంచ: నేషనల్ మీమ్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు పాల్వంచ కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు సుబ్రహ్మణ్యం, ఎండీ.అఫ్రా అమీన్, వేదవ్యాస, డి.ఉమేశ్ ఎంపికైనట్లు శుక్రవారం హెచ్ఎం ఎస్.మాధవరావు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

కొత్తగూడెంఅర్బన్: బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధి గణేష్ బస్తీలో మహారాష్ట్ర జాతీయ బ్యాంకును అధికారికంగా ప్రారంభించారు. డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బ్యాంకు జోనల్ మేనేజర్ ప్రసాద్, మేనేజర్ మంగ్యా నాయక్, డాక్టర్ మోహన్‌బాబు, తాటిపల్లి శంకర్‌బాబు, మిట్టపల్లి మురళి పాల్గొన్నారు.

పని చేయని డయాలసిస్ కేంద్రం

- ఖమ్మం, మహబూబాబాద్, అశ్వారావుపేటకు పేషెంట్ల తరలింపు
- 130 కిలోమీటర్లు వెళ్లలేమంటున్న బాధితులు
- 100 పడకల ఆస్పత్రిలో సదుపాయాలపై ఆరా తీసిన టీఎస్ఎంఐడీసీ



ఇల్లెందు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో డయాలసిస్ మిషన్లు వారంరోజులుగా పని చేయడం లేదు. గత శనివారం నుంచి డయాలసిస్ బాధితులను ఖమ్మం, మహబూబాబాద్, అశ్వారావుపేటలకు తరలిస్తున్నారు. 130 కిలోమీటర్ల దూరం వెళ్లటం కష్టంగా మారిందని రోగులు ఆందోళన చెందుతున్నారు. వారంలో రెండు, మూడు సార్లు డయాలసిస్ చేయాల్సిన రోగులకు సుదూర ప్రాంతాలకు వెళ్లి చేయించుకోవటం భారంగా మారుతోంది. జేబు నుంచి ఖర్చు చేసి వెళ్లి రావాలంటే ఆర్థిక భారం తడిచి మోపెడు అవుతోంది. గత శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఉరుములు, మెరుపులు, పిడుగులు పడటంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగింది. ఈక్రమంలో షార్ట్ సర్క్యూట్ అయింది. మిషన్లు పని చేయటం నిలిచిపోయాయి. విద్యుత్ పరికరాలు కాలిపోయాయని టెక్నీషియన్స్ తేల్చారు. ఐదు మిషన్లకు అవసరమైన పరికరాలకు ఇండెంట్ పెట్టారు. మెటీరియల్ వస్తే టెక్నీషియన్ మరమ్మతులు చేపడితే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

మరమ్మతులు చేయకుంటే కష్టమే..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల భవనం మరమ్మతు చేయకుంటే మనుగడ కష్టంగా మారనుంది. ప్రస్తుతం పాత, కొత్త భవనంలో 100 పడకల ఆస్పత్రి రన్ అవుతోంది. అయితే పాత భవనంతో పాటు కొత్త భవనం కూడా వర్షానికి పైకప్పు లీక్ అయి నీరు కారుతోంది. గోడల్లోకి నీరు దిగుతోంది. ఫలితంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతోంది. ఈ ప్రమాదం నుంచి బయట పడాలంటే తక్షణం స్లాబ్‌కు లీకేజీని అరికట్టాలంటే కెమికల్ కోటింగ్ చేయాల్సి ఉంది. ఇక ఆస్పత్రి అంతా కొత్తగా విద్యుత్ నిర్మాణం చేయాల్సి ఉంది. పూర్వకాలంలో విద్యుత్ లైన్‌కు ఐరన్ పైపులు వాడినందున వర్షానికి గోడలు తడిచి ప్రమాదం అవుతోంది. తక్షణమే ప్లాస్టిక్ పైపులతో గోడల మీదుగా కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అటు కెమికల్ కోటింగ్, ఇటు విద్యుత్ లైన్లకు సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు అవుతుందని అధికారులు చెబుతున్నారు.

పరిశీలిస్తున్న అధికారులు..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేందుకు ఈ వర్షాకాలంలో పాత కొత్త భవనంలో ఆస్పత్రిని నడిపించేందుకు తక్షణం మరమ్మతులు చేయాల్సి ఉన్నందున నిధుల కోసం ఆరా తీస్తున్నారు. అటు కలెక్టర్, ఇటు ఎమ్మెల్యే, వైద్య ఆరోగ్యశాఖకు లిఖిత పూర్వకంగా పరిస్థితిని వివరించారు. ఏ వైపు నుంచి అయినా నిధులు విడుదల అయితే ఇక తిరుగులేని విధంగా మారే అవకాశం ఉంటుంది.

100 పడకల ఆస్పత్రిలో సదుపాయాలపై ఆరా తీసిన టీఎస్ఎంఐడీసీ...

ఇల్లెందులో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేసినప్పటికీ అందుకు ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదు. డాక్టర్లు, సిబ్బంది, భవనం, మెటీరియల్ లేకపోవటంతో 100 పడకల ఆస్పత్రి నడిపేందుకు తగిన సదుపాయాల కోసం గత నెలలో ఎమ్మెల్యే కోరం కనకయ్య వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో వైద్య ఆరోగ్యశాఖ నుంచి తెలంగాణ స్టేట్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎంఐడీసీ) అందిన ఆదేశాల ఆధారంగా ఇల్లెందులోని సదుపాయాలు, వైద్యులు, సిబ్బంది, భవనం, మెటీరియల్ కోసం ఆరా తీసింది. వివరాలు అందజేయాలని కోరగా సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్ నివేదికను అందజేశారు.

నిలిచిపోయిన గైనకాలజీ సేవలు..

ఏడాది కాలంగా మహిళలకు ఇల్లెందులోనే అందుబాటులో ఉన్న గైనకాలజీ సేవలు గత నెల రోజులుగా నిలిచిపోయాయి. ఇక్కడి గైనకాలజీ డాక్టర్ సెలవులో వెళ్లటంతో మహిళలకు ప్రసూతీ సేవలు అందకుండా పోయాయి. ఇల్లెందుకు కొత్తగూడెం నుంచి ఓ గైనకాలజీ డాక్టర్‌ను డిప్యూటేషన్ మీద నియమించకపోతే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది.



డయాలసిస్ మిషన్‌కు మరమ్మతులు చేస్తున్న టెక్నీషియన్

త్వరలో అందుబాటులోకి తెస్తాం..



ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో వారం నుంచి డయాలసిస్ సేవలు నిలిచిపోయాయి. సోమవారం వరకు అందుబాటులోకి వస్తాయి. మిషన్లలో తలెత్తిన అంతరాయాన్ని సరిదిద్దే ప్రయత్నం జరుగుతోంది. మెటీరియల్ రాగానే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెస్తాం. పేషంట్లను ఖమ్మం, మహబూబాబాద్, అశ్వారావుపేటలకు పంపుతున్నాము. ఇక టీఎస్ఎంఐడీసీకి నివేదిక అందజేశాం.

– డాక్టర్ హర్షవర్ధన్, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఇల్లెందు

సీపీఐ మరింత బలమైన శక్తిగా ఎదగాలి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: కమ్యూనిస్టులు లేని సమాజాన్ని ఊహించుకోలేమని, బలమైన రాజకీయ శక్తిగా ఇంకా ప్రజల్లోకి వెళ్లాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. పట్టణంలో రెండు రోజుల పాటు జరగనున్న రాజకీయ శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన సీపీఐ జెండా ఎగురవేసి ప్రారంభించారు. కూనంనేని మాట్లాడుతూ... మానవునికి మెరుగైన జీవన విధానాన్ని అందించగలిగేది మార్క్సిజం మాత్రమే అన్నారు. శతాబ్దపు విప్లవోద్యమంలో అనేక ఎత్తుపల్లాలను కమ్యూనిస్టు పార్టీ చవిచూసిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు పేదప్రజలకు అండగా పార్టీ పనిచేస్తోందన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజలను ఏకం చేసి ప్రభుత్వాల ద్వంద్వ నీతిని ఎండగడుతూ ముందుకు సాగడమే కమ్యూనిస్టుల సిద్ధాంతం అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన వెనుకబాటును పునఃరావృతం కాకుండా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. నిత్యం ప్రజా సమస్యలే ఏజెండా పనిచేయాలని, రాష్ట్రంలో మరింత బలంగా ప్రజావాణి వినించేలా, పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లేందుకు చురుకైన పాత్ర వహించాలన్నారు. ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ.. సమాజంలో చొప్పిస్తున్న విషభావజాలం నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. కులమత, వర్గ పోరాటం అనే అంశంపై బోధించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్ట్ పార్టీ అంటే ప్రజల ఏజెండాగా మార్చాలన్నారు. ఎండీ.యూసఫ్ నూతన లేబర్ కోడ్‌లపై, ప్రొఫెసర్ యుగల్ రాయలు భారత కమ్యూనిస్ట్ పార్టీ చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌కె.సాబీర్‌పాషా, నరాటి ప్రసాద్, ముత్యాల విశ్వనాథం, మున్నా లక్ష్మీకుమారి, ఏపూరి బ్రహ్మం, పుల్లారెడ్డి, సలీం, చంద్రగిరి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, చలిగంటి శ్రీనివాస్, ఎల్లయ్య, చంద్ర నరేంద్రకుమార్, శంకర్, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, అడుసుమల్లి సాయిబాబు, వెంకటేశ్వరరావు, సుధాకర్, పద్మనాభరాజు, రామచందర్, నాగయ్య పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెంలోని విత్తన దుకాణాలను శుక్రవారం ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇల్లెందు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వాసవీరాణి మాట్లాడుతూ... విత్తనాలను ఎమ్మార్పీ కన్నా ఎక్కువ రేట్లకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా, నకిలీ విత్తనాలు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. తనిఖీలలో పలు రికార్డులను పరిశీలించారు. ఫార్మర్ సేల్ రిజిస్టర్, ఇన్‌వాయిస్ ఫైల్స్, పీసీ ఫైల్స్, ఫారం సి బిల్లు పుస్తకాలు, ఫిజికల్ స్టాక్‌ను పరిశీలించారు. నాగార్జున ట్రేడర్స్, ప్రేమ్‌కుమార్ ఖండేల్‌వాల్ షాపు, చంద్ర పెస్టిసైడ్స్, రవి హైబ్రిడ్ సీడ్స్, అరవింద్ సాయి సీడ్స్, తెలుగు గ్రామీణ రైతు సేవ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.గోపాలరావు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి ఉన్నతంగా ఎదగాలి



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎస్సై సోమేశ్వర్

ఇల్లెందురూరల్: జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు విద్యార్థి దశలో చక్కగా చదువుకోవాలని ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని 21పిట్ హైస్కూల్‌లో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతేడాది పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించి విద్యార్థులంతా అందరి ప్రశంసలు పొందారని, ఈ విద్యాసంవత్సరంలో పదికి పది జీపీఏ సాధించేందుకు శ్రమించాలని ఆకాంక్షించారు. ఆ దిశగా పాఠశాల ప్రారంభం నుంచే విద్యార్థులంతా ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు.

ఘనంగా అక్షరాభ్యాసం...

టేకులపల్లి: ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం కొప్పురాయి, బర్లగూడెం, మొక్కంపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన సామూహిక అక్షరాభ్యాసంలో డిప్యూటీ తహసీల్దార్ ముత్తయ్య పాల్గొని చిన్నారులతో అక్షరాలు దిద్దించారు.

ఇల్లెందురూరల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని మెలగాలని కొమరారం ఎస్సై సోమేశ్వర్ అన్నారు. మండలంలోని పోలారం గ్రామపంచాయతీ భద్రుతండా గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆయన యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చక్కగా చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, వెంకట్రాం, కిషన్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు విజయ, పోలీసు సిబ్బంది రాకేష్, లాలు, పంచాయతీ గుమస్తా జటంగి వెంకన్న, సిబ్బంది కౌసల్య పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ సంఘం ఆవిర్భావ దినోత్సవం



యూనియన్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చుంచుపల్లి: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని కొత్తగూడెంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ కాంప్లెక్స్‌లోని కార్యాలయం వద్ద యూనియన్ నాయకులు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో 1958లో యూనియన్ ఏర్పడి కార్మిక సమస్యలు పరిష్కారంలో అనేక వేతన సవరణలు తేవడంతో విజయం సాధించిందని చెప్పారు. ప్రత్యేక తెలంగాణ కోసం సకల జనుల సమ్మెలో ముందుండి రాష్ట్ర సాధనకు కృషి చేసిందన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.భాస్కర్‌రావు, ఎస్ఆర్ బాబు, ఆర్ఎన్ సింగ్, జీఆర్ బాబు, శ్రీను, రవి, నరేష్, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జూలూరుపాడు: పాపకొల్లు, పడమటనర్సాపురం, జూలూరుపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

23న ఇఫ్టూ జిల్లా జనరల్ కౌన్సిల్

ఇల్లెందు: ఎన్డీ అనుబంధ ఇఫ్టూ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 23న ఇల్లెందులో నిర్వహిస్తున్నట్లు ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి బి.రాంసింగ్ తెలిపారు. శుక్రవారం ఇల్లెందులో ఇఫ్టూ జిల్లా సమావేశం అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం రాంసింగ్ మాట్లాడుతూ... దేశంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేసి కార్మికచట్టాలను కాలరాశాడని తెలిపారు. మరోమారు అధికారంలోకి వచ్చి దేశంలోని పరిశ్రమలను ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకు అమ్మే ప్రయత్నం చేయబోతున్నాడని ఆరోపించారు. మోదీ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఇఫ్టూ సమరశీల పోరాటాలకు సిద్ధం అవుతుందని తెలిపారు.

అడవులను కాపాడండి



అటవీశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ..

టేకులపల్లి: మానవాళికి ప్రాణవాయువుని అందించే వృక్షాలను, అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని టేకులపల్లి ఎఫ్ఆర్ఓ ఎండీ.ముఖ్తార్ హుస్సేన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి రేంజ్ ఆధ్వర్యంలో మండలంలోని బోడు బీట్ పరిధిలో స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ... ప్రతీఒక్కరు మొక్కలను నాటాలని, వాటిని సంరక్షించాలని కోరారు. ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో అనుమతులు లేకుండా బోర్లు వేయవద్దని, ఐటీడీఏ పీఓ అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో కొత్తగా విద్యుత్ లైన్లు వేసేందుకు అనుమతి లేదన్నారు. పోడు భూముల్లో సోలార్, జనరేటర్ ద్వారా బోర్లను వాడాలని తెలిపారు. కొత్తగా చెట్లు నరికి అటవీ ఆక్రమణ చేస్తే వారి ఆర్ఓఎఫ్ఆర్ హక్కు పత్రాన్ని రద్దు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వన్య ప్రాణులను వేటాడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బి.శ్రీను, పి.దేవ్‌సింగ్, ఎఫ్‌బీఓలు హతీరాం, నాగేశ్, బి.రాంసింగ్, మోహన్, గాంధీ, మల్లయ్య పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వండి..



మాట్లాడుతున్న యాకూబ్ షావలీ

టేకులపల్లి: కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకూబ్ షావలీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఐఎఫ్‌టీయూ టేకులపల్లి ఏరియా నాలుగో మహాసభ మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సింగరేణిలో రూ.కోట్ల లాభాలు వస్తున్నాయని, దీనికి కారకులైన కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. కేటీసీలో 2003 నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు బొగ్గు టిప్పర్ల ద్వారా, నవభారత్, కేటీపీఎస్, బీపీఎల్, ఇల్లెందు, డంపింగ్ చేస్తున్న డ్రైవర్లకు కనీస వేతనాలు, పీఎఫ్ అమలు చేయకపోవడం విడ్డూరం అన్నారు. కోల్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లకు, కన్వేనియన్స్ డ్రైవర్లకు సీఎంపీఎఫ్ అమలు చేస్తామని సర్క్యులర్ జారీ చేసినప్పటికీ నేటివరకు బొగ్గు టిప్పర్ డ్రైవర్లకు అమలు చేయలేదని విమర్శించారు. బొగ్గు టిప్పర్ డ్రైవర్లకు కూడా కనీస వేతనాలు, పీఎఫ్ తదితర చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి గ్రామపంచాయతీ, భగీరథ తదితర రంగాల కార్మికులలో పనిచేసే కార్మికులను పర్మనెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న, ఇఫ్టూ జిల్లా నేత జరుపుల సుందర్, వాంకుడోత్ నరేష్, ఏనుటి నాగయ్య పాల్గొన్నారు.

జీతాలు పెంచాలి



కమిషనర్ స్వామితో మాట్లాడుతున్న కొత్వాల

పాల్వంచ: మున్సిపాలిటీలో 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని, వారి వేతనాలను పెంచాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ఎ.స్వామిని కలిసి వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ.. నిత్యావసరాల ధరలు పెరుగుతున్న తరుణంలో కార్మికులకు వేతనాలు పెంచకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి వేతనాలు పెంచే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు, ఏఈ రాజేశ్, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, కందుకూరి రాము, మాలోతు కోటి, పైడిపల్లి మహేశ్, కార్మికులు బి.నరేశ్, ఎస్‌కే.అక్బర్, ఎస్‌కే.జానీ, పవన్, రామజోగి పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ డీవీ, కౌన్సిలర్ పద్మావతి

ఇల్లెందు: నాలుగు రోజులుగా పట్టణంలోని 24 వార్డుల్లో శానిటేషన్ డ్రైవ్ సాగుతోంది. ఆరు నెలలుగా వరుస ఎన్నికల కారణంగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఇక వార్డుల్లో శానిటేషన్ ప్రక్రియ కూడా నిలిచిపోయింది. ఫలితంగా పట్టణం మురికి కూపంగా మారింది. ఈ క్రమంలో వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని రోడ్ల మీద చెత్తచెదారం, పిచ్చిమొక్కల తొలగింపు, డ్రెయినేజీ క్లీన్ అండ్ గ్రీన్ పనులు వేగవంతం చేశారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు స్వయంగా వార్డులో పనులను పర్యవేక్షిస్తున్నారు. శానిటేషన్ డ్రైవ్‌ను ముమ్మరం చేశారు. వర్షాకాలం నాటికి డ్రెయిన్లు, కాలువలలో పేరుకుపోయిన చెత్తను తొలగించకపోతే నీరు పోటు ఎత్తి రోడ్ల మీదకు వచ్చే అవకాశం ఉంటుందని పనులు వేగవంతం చేశారు. నాలుగు రోజులుగా ఆయా వార్డుల్లో ట్రాక్టర్లు, సిబ్బంది శ్రమిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని 2వ వార్డులో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టారు. స్థానిక కౌన్సిలర్ కటకం పద్మావతితో కలిసి చైర్మన్ పనులను పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ అధికారి రాధాకృష్ణ, జవాన్లు అంజాద్, ప్రకాష్ ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పాల్వంచరూరల్: వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతంలో వ్యాధులు ప్రబలకుండా సంబంధిత అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని ప్రజలు దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తాగునీటి ద్వారా సంక్రమించే వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలను అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వివేక్, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, పీహెచ్‌సీల వైద్యులు, పంచాయతీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాలు తనిఖీ..

బంద్రుగొండ, దంతలబోరు, ఎస్సీకాలనీ, సంఘం గ్రామపంచాయతీలో ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామపంచాయతీలో అమ్మ, ఆదర్శ పాఠశాలల పనులు, శానిటేషన్ పనులు, నర్సరీలు, అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించారు. విద్యార్థులకు అందజేసిన దుస్తులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దంతలబోరు స్కూల్‌లో విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ భోజనం చేసి మధ్యాహ్న భోజనాల నాణ్యతను పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ లోపం లేకుండా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు మౌనిక, నారాయణ, రాజశేఖర్ పాల్గొన్నారు.



చుంచుపల్లి: మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య బృందం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు మాట్లాడుతూ... వర్షాకాలం రాబోతున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండే విధంగా చూడాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై కరపత్రాన్ని ముద్రించి గ్రామాలలో పంపిణీ చేస్తే ప్రజలందరికీ అవగాహన కలుగుతుందన్నారు. తగు చర్యల ద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అందరూ ముందస్తు జాగ్రత్తగా ఉంటారని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న డ్రెయినేజీలను శుభ్రం చేస్తూ, నివాస ప్రాంతాల చుట్టుపక్కల మరియు రహదారుల వెంబడి ఉన్న పిచ్చిమొక్కలను తొలగిస్తూ నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూసి దోమల అభివృద్ధి చెందకుండా చేసి ఆయిల్ బాల్స్ వదలటం, ఫాగింగ్ చేస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సదస్సులో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బాదావత్ శాంతి, మండల ప్రత్యేక అధికారి బి.సులోచన రాణి, డాక్టర్లు వాణి, నేహా అఫ్రీన్, ఎంపీడీఓ అశోక్ కుమార్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: దంతలబోరు పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ